## క్లుప్తంగా

### మండల పరిషత్ నిధులతో అభివృద్ధి పనులు



అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న సన్యాసినాయుడు

గుర్ల: మండలంలోని పాలవలసలో మండల పరిషత్ నిధులు రూ.4లక్షలతో అబివృద్ధి పనులకు వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పొట్నూరు సన్యాసినాయుడు మంగళవారం శంకుస్థాపన చేశారు. పాలవలసలోని పైడితల్లిమ్మ గుడి వరకు సీసీ రోడ్డు, ఇరువైపులా కాలువ నిర్మించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ బూర్లె శ్రీనివాసరావు, స్థానిక నేతలు పెదమజ్జి అప్పలనాయుడు, రొతు రామునాయుడు పాల్గొన్నారు.

### ఇంటర్వ్యూలకు 277 మంది హాజరు



ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్న బ్యాంకు అధికారులు

వేపాడ: మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన బీసీ కార్పొరేషన్ రుణాల ఇంటర్వ్యూలకు 277 మంది హాజరైనట్టు ఎంపీడీఓ సీహెచ్ సూర్యనారాయణ తెలిపారు. ఎంపీడీఓ ఆధ్వర్యంలో జరిగిన ఇంటర్వ్యూల్లో వేపాడ, బొద్దాం ఏపీజీవీ బ్యాంకు, ఎస్‌బీఐ వేపాడ బ్రాంచి, డీసీసీబీ బ్యాంకు అధికారులు పాల్గొని ఆయా బ్యాంకుల పరిధిలో అర్జీదారుల ధ్రువపత్రాలు, రుణం పొందేందుకు అర్హతలను పరిశీలించారు. ఈఓపీఆర్‌డీ రవి, సూపరింటెండెంట్ మహేష్ తదితరులు పాల్గొన్నారు.

### నెలాఖరులోగా ఈకేవైసీ చేయించుకోవాలి

వేపాడ: మండలంలోని రేషన్ కార్డుదారులు ఈ నెల 31లోగా ఈకేవైసీ చేయించుకోవాలని సీఎస్‌డీటీ రామకృష్ణ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మే నెలలో ఏటీఎం సైజ్‌లో కొత్త రేషన్‌కార్డులు జారీ చేయనున్నట్లు తెలిపారు. ఈకేవైసీ ప్రక్రియ పూర్తి కాగానే కొత్త కార్డులు జారీ చేయనునన్నట్ల తెలిపారు. ఏప్రిల్ నెలలో రేషన్ తీసుకున్నప్పుడు కార్డులో వున్న ప్రతీ లబ్ధిదారుడు ఈకేవైసీ అయిందా.. లేదా.. చూసుకోవాలన్నారు. రేషన్ తీసుకునే సమయంలో గ్రీన్‌కలర్ వస్తే ఈకేవైసీ పూర్తయినట్టని, రెడ్ కలర్‌వస్తే ఈకేవైసీ చేయించుకోవాలన్నారు.

### నేడు ఇంటర్వ్యూలు

మెరకముడిదాం: మండలానికి సంబంధించి బీసీ సంక్షేమ రుణాలకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు ఇంటర్వ్యూలను తమ కార్యాలయంలో బుధవారం నిర్వహించనున్నట్టు ఎంపీడీఓ జి.భాస్కరరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ రుణాలకు సంబంధించి దరఖాస్తులు చేసుకున్న 337 మంది అభ్యర్థులు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరు కావాలని సూచించారు.

**ఎస్.కోటలో..**

శృంగవరపుకోట: బీసీ కార్పొరేషన్ ద్వారా రుణాల కోసం దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు బుధవారం ఉదయం ఎంపీడీఓ కార్యాలయంలో ఇంటర్వ్యూలు జరగనున్నాయని హాజరు కావాలని ఈఓపీఆర్‌డీ బి.లక్ష్మి మంగళవారం తెలిపారు. అభ్యర్థులు తమ విద్యార్హత, ఇతర ధ్రువపత్రాలతో ఉదయం 10 గంటలకు హాజరు కావాలని ఆమె సూచించారు.

### చంద్రంపేటలో శ్రీరామ సంకీర్తన

గంట్యాడ: దైవ భక్తిని ప్రతి ఒక్కరూ పెంపొందించుకోవాలని ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులనాయుడు అన్నారు. మండలంలోని చంద్రంపేట గ్రామంలో శ్రీరామనవమి సందర్భంగా రామాలయంలో ఏర్పాటు చేసిన శ్రీరామ సంకీర్తన కార్యక్రమంలో ఆయన మంగళవారం పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీరాముని సేవలో పాల్గొనడం ఆనందంగా ఉందన్నారు. చలుమూరు వాసుదేవరావు తదితరులు పాల్గొన్నారు.

### ఫాం పాండ్స్ ప్రారంభం

గంట్యాడ: సేద్యపు నీటి కుంటలు (ఫాం పాండ్స్) ప్రతీ రైతు తీసుకోవాలని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. మండలంలోని కొత్తవెలగాడ గ్రామంలో సేద్యపు నీటి కుంటలను మంగళవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సేద్యపు నీటి కుంటల వల్ల భూగర్భ జలాలు పెరుగుతాయన్నా రు. వర్షాభావ పరిస్థితుల్లో ఇవి ఉపయోగపడతాయన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ఆర్‌వీ రమణమూర్తి, ఏపీఓ సుందరరావు పాల్గొన్నారు.

### 11న పూలే, అంబేడ్కర్ జయంత్యుత్సవాలు

శృంగవరపుకోట: మహాత్మా జ్యోతిబాపూలే, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతి ఉత్సవాలను ఈ నెల 11న శివరామరాజుపేటలో నిర్వహించనున్నట్టు జైభీమ్ యువజన సేవా సంఘం సభ్యులు కె.జగదీష్, పి.వెంకటరమణ, ఎం.వెంకటరమణ తెలిపారు. దీనికి సంబంధించిన వాల్‌పోస్టర్లను వారు మంగళవారం విడుదల చేశారు. కార్యక్రమంలో జైభీమ్ యువజన సంఘం సభ్యులు, బహుజన కళామండలి సభ్యులు పాల్గొన్నారు.

# పెరుగుతున్న ఆయిల్‌పామ్ సాగు

- గత ప్రభుత్వంలోనే రైతులకు సాగు ప్రోత్సాహకాలు
- మొక్కలు పెంచడం నుంచి డ్రిప్ వరకు రాయితీలు
- కొనసాగిస్తున్న ప్రస్తుత ప్రభుత్వం
- నియోజకవర్గంలో 127 హెక్టార్లలో ఆయిల్ పామ్ సాగు



మెరకముడిదాం మండలం గరుగుబిల్లిలో ఆయిల్‌పామ్ సాగు

**మండలాల వారీగా ఆయిల్‌పామ్ సాగు విస్తీర్ణం ఇలా...**

| మండలం | సాగు విస్తీర్ణం (హెక్టార్లలో..) |
|---|---|
| చీపురుపల్లి | 45 |
| గరివిడి | 15 |
| గుర్ల | 25 |
| మెరకముడిదాం | 42 |
| మొత్తం | 127 |

చీపురుపల్లి: సాంప్రదాయ పంటల సాగులో వాతావరణం అనుకూలించక ప్రతీ సంవత్సరం రైతులు నష్టపోతుండడంతో ఆ నష్టాలు బాట నుంచి లాభాల బాటల్లోకి అడుగులు వేయించే విధంగా గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలోనే బీజం పడింది. నష్టాలు తప్ప లాభాలు రాని పంటలను పక్కన పెట్టి రైతులు పడ్డ కష్టానికి ఫలితం ఉండే విధంగా లాభాలు ఆర్జిస్తున్న ఆయిల్ పామ్ పంట సాగును గత ప్రభుత్వం ప్రోత్సహించింది. దీని కోసం అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో ఆయిల్‌పామ్ సాగుపై రైతుల్లో విస్తృతంగా అవగాహన కల్పించారు. పంట సాగు చేసే రైతులకు చక్కని ప్రోత్సాహకాలు కూడా ప్రకటించారు. ఆయిల్ పామ్ సాగుకు సంబంధించి మొక్క నాటినప్పటి నుంచి పంట దశలో దిగుబడి వచ్చేంత వరకు నాలుగేళ్ల వరకు రైతులకయ్యే ఖర్చు మొత్తాన్ని ప్రభుత్వమే భరించే విధంగా గతంలో అప్పటి ప్రభుత్వం మార్గదర్శకాలు ఇచ్చింది. దీంతో గత ప్రభుత్వంలో చీపురుపల్లి నియోజకవర్గంలో 62 ఎకరాల వరకు ఆయిల్‌పామ్ సాగయ్యేది. అదే కోవలో ప్రస్తుత ప్రభుత్వం కూడా ప్రోత్సాహకాలను కొనసాగిస్తుండడంతో ఈ ఏడాది మరో 65 ఎకరాల వరకు సాగు విస్తీర్ణం పెరిగింది. దీని సాగుకు మరి కొంత మంది రైతులు ముందుకొస్తున్నారు.

**రాయితీ వివరాలు**

అత్యధికంగా లాభాలను తెచ్చి పెట్టే ఆయిల్‌పామ్ పంట సాగుకు గత ప్రభుత్వం నుంచి ప్రస్తుత ప్రభుత్వం వరకు రాయితీలు అందిస్తూ ప్రోత్సాహకాలు అందిస్తున్నారు. ఆయిల్‌పామ్ సాగులో ఎకరాకు 57 మొక్కలకుగాను ఒక్కో మొక్కకు రూ.193 ప్రభుత్వం చెల్లిస్తోంది. మొక్కలు నాటినప్పటి నుంచి నాలుగేళ్ల పంట దిగుబడి సాధించేంత వరకు సాగు ఖర్చు కోసం ఎకరాకు రూ.5 వేలు రైతు బ్యాంకు ఖాతాలో జమ చేస్తారు. అలాగే ఏపీ ఎంఐపీ నుంచి డ్రిప్ ఏర్పాటు చేసుకునేందుకు రూ.2.20 లక్షలు వరకు ప్రభుత్వం అందిస్తోంది.



చీపురుపల్లి మండలం పెదనడిపల్లిలో ఆయిల్‌పామ్ సాగు పరిశీలిస్తున్న ఉద్యానవన శాఖాధికారులు



గరివిడిలోని నర్సరీ నుంచి మొక్కలు తీసుకెళ్తున్న రైతులు

**ఎకరాకు 8 టన్నుల దిగుబడి**

ఆయిల్‌పామ్ సాగులో రైతులు అధిక లాభాలు పొందవచ్చునని ఉద్యానవన శాఖాధికారులు చెబుతున్నారు. ఆయిల్‌పామ్ మొక్క నాటిన నాలుగు సంవత్సరాల నుంచి పంట దిగుబడి ప్రారంభమవుతుంది. ఎకరాకు 8 టన్నుల వరకు దిగుబడి సాధిస్తుందని, ప్రతీ పదిహేను రోజులకోసారి గెలలు కోయవచ్చు. ఆయిల్‌పామ్ టన్ను ధర అంతర్జాతీయ క్రూడ్ ఆయిల్ ధరలు ప్రకారం గరిష్ఠంగా రూ.22 వేలు, కనిష్ఠంగా రూ.12 వేలు ఉంటుంది. ఉద్యానవన శాఖ అధికారులు లెక్కల ప్రకారం ఎకరాకు రూ.30 వేలు వరకు ఖర్చు అవుతుందని, దిగుబడి వచ్చాక రూ.70 వేల నుంచి రూ.90 వేల వరకు ఆదాయం వస్తుందని చెబుతున్నారు.

**ఆయిల్‌పామ్ సాగుపై దృష్టి సారించాలి**



రైతులు ఆయిల్‌పామ్ సాగుపై దృష్టి సారించాలి. సాగునీటి వనరులు ఉన్న పంట పొలాల్లో ఆయిల్ పామ్ సాగు చేస్తే లాభాలు పొందవచ్చు. ఆయిల్‌పామ్ తోటల విస్తీర్ణ అభివృద్ధి పథకంలో భాగంగా ప్రభుత్వం కూడా ఎన్నో ప్రోత్సాహకాలు అందిస్తోంది. ఎకరాకు 57 మొక్కలు అందిస్తూ ఒక్కో మొక్కకు రూ.193 ప్రభుత్వం చెల్లిస్తుంది. మొక్క నాటినప్పటి నుంచి నాలుగేళ్ల వరకు ఎరువులు, అంతర్ పంటలు సాగు కోసం ఎకరాకు రూ.5 వేలు చొప్పున రైతుల ఖాతాలో ప్రభుత్వం జమ చేస్తుంది. డ్రిప్ ఏర్పాటుకు ప్రభుత్వం ఏపీఎంఐపీ ద్వారా రుణం అందిస్తుంది. రైతులు పండించిన పంటను ఇక్కడే గరివిడిలో ఉన్న పరిశ్రమ వారే తీసుకునే సదుపాయం కూడా ఉంది.

– సీహెచ్ చంద్రశేఖర్, ఉద్యానవన శాఖాధికారి

# లక్ష్య సాధనతో ఉజ్వల భవిష్యత్



నృత్యాలతో అలరిస్తున్న కళాశాల విద్యార్థినిలు

చీపురుపల్లి రూరల్(గరివిడి): విద్యార్థులు తమ బంగారు భవిష్యత్ కోసం లక్ష్యాన్ని నిర్దేశించుకొని పట్టుదల, కృషితో ముందుకు సాగాలని అవంతీ విద్యా సంస్థల చైర్మన్ ముత్తంశెట్టి శ్రీనివాసరావుతో పాటు పలువురు ప్రముఖులు అన్నారు. గరివిడి అవంతీ సెయింట్ థెరిసా ఇంజనీరింగు కళాశాలలో మంగళవారం కళాశాల ప్రిన్సిపాల్ డా.వి.జాషువాజయప్రసాద్ ఆధ్వర్యంలో కళాశాల 24వ వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా పాల్గొన్న వారు మాట్లాడుతూ విద్యార్థులు కళాశాలలో ఉన్న మౌలిక సౌకర్యాలను సద్వినియోగం చేసుకుని అభివృద్ధి చెందాలన్నారు. దేశానికి కావాల్సిన వనరులు యువత మేధస్సు మీదనే ఆధారపడి ఉందన్నారు.భారతదేశం యువత అన్ని రంగాల్లో ముందన్నారన్నారు. ప్రతీ విద్యార్థి ఆత్మ విశ్వాసం, పాజిటివ్ యాటిట్యూడ్‌తో మెలగాలన్నారు. ఇంజనీరింగ్ విద్యలో ప్రధానంగా ఉండాల్సిన కమ్యూనికేషన్ స్కిల్స్, టెక్నికల్ స్కిల్స్, లెర్నింగు స్కిల్స్‌ను అభివృద్ధి చేసుకోవాలన్నారు. ఈ సందర్భంగా విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో అతిథులు శ్రీకాకుళం రాజీవ్‌గాంధీ యూనివర్సిటీ ఆఫ్ నాలెడ్జ్ టెక్నాలజీస్(ఆర్‌జీయూకేటీ) ప్రొఫెసర్ కెవిజిడి.బాలాజీ, గుర్ల సిద్ధయోగాశ్రమ బ్రహ్మర్షి స్వామిలక్ష్మణానంద పరమహంస, డీఎస్పీ ఎస్.రాఘవులు, విజయనగరం జేఎన్‌టీయూ ఐటీ విభాగాధిపతి సిహెచ్.మాధురి, సీఐ జి.శంకరరావు, వివిధ విభాగాధిపతులు, అధ్యాపక సిబ్బంది పాల్గొన్నారు.

### నూతన కార్యవర్గం ఎన్నిక



బార్ అసోసియేషన్ నూతన కార్యవర్గం

గజపతినగరం : స్థానిక బార్ అసోసియేషన్ న్యాయవాదుల నూతన కార్యవర్గం స్థానిక సివిల్ కోర్టులో ఏకగ్రీవంగా ఎన్నికైంది. న్యాయవాదుల సంఘం నూతన అధ్యక్షుడిగా లెంక రాంబాబు, కోశాధికారిగా ఉప్పలపాటి రమేష్, సెక్రటరీగా రాపాక సాయిసురేష్, ఉపాధ్యక్షుడిగా నాలం రామ్ ప్రసాద్, జాయింట్ సెక్రటరీగా జెర్రిపోతుల జగదీష్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

# ఫిరంగి కొండను తవ్వేస్తున్నారు..



కొత్తవలస పంచాయతీ పరిధిలో ఫిరంగి కొండను తవ్వేస్తున్న అక్రమార్కులు

- సెలవు రోజు వస్తే.. రెచ్చిపోతున్న అక్రమార్కులు
- ఇష్టారాజ్యంగా గ్రావెల్ తరలింపు
- ఆపై చదును చేసిన జాగా ఆక్రమణ

కొత్తవలస : మండల కేంద్రం గిడిజాల రోడ్డు సమీపంలో గల ఫిరంగి కొండను కొందరు అక్రమార్కులు అదే పనిగా తవ్వేస్తున్నారు. జేసీబీలు పెట్టి కొండను రెండు వైపుల నుంచి తవ్వుకుంటూ పోతున్నారు. ఈ క్రమంలో కొండపై ఉన్న రకరకాల చెట్లు నేలకూలుతున్నాయి. ముఖ్యంగా సెలవు రోజులొస్తే అక్రమార్కులు రెచ్చిపోతున్నారు. ప్రభుత్వ కార్యాలయాలకు సెలవు రోజున జేసీబీ, ట్రాక్టర్లు ఆ కొండపై వాలిపోతున్నాయి. వీటి సాయంలో కంకర, రాళ్లు తవ్వేసి అక్రమంగా తరలించేస్తున్నారు. మండల కేంద్రానికి కూత వేటు దూరంలో ఉన్న దీని పరిస్థితే ఇలా ఉంటే మిగతా ప్రాంతాల్లోని కొండల పరిస్థితి ఏంటన్నది అధికారులే తేల్చాలి. కూటమి పాలనలో తమను అడిగే వాడే లేడంటూ అక్రమార్కులు ఇష్టారాజ్యంగా కొండను తవ్వేస్తున్నారు. అధికారులు అప్పుడప్పుడు సమాచారం తెలిసి అక్కడికి వెళ్తే. కూటమి నాయకుల హుకుంలతో వెనక్కి వచ్చేస్తున్నారు. దీంతో రెవెన్యూ అధికారుల పరిస్థితి అడకత్తెరలో పోక చెక్క మాదిరి తయారైంది. పచ్చని కొండ మంచు కొండలా తరిగిపోతున్నా పట్టించుకునే పరిస్థితి లేకుండా పోయింది. ఈ అక్రమాలను చూసి పర్యావరణ ప్రేమికులు ఆందోళన చెందుతున్నారు. పర్యావరణాన్ని కాపాడాల్సిన అధికారులు కళ్లు మూసుకుని కూర్చుంటున్నారని విమర్శిస్తున్నారు.

**జాగా ఆక్రమణ**

కొండను తవ్వేసిన తరువాత ఆ ప్రాంతాన్ని చదును చేస్తున్న ఆక్రమణదారులు ఆ స్థలాన్ని ఆక్రమించేస్తున్నారు. ఒక ప్రణాళిక ప్రకారమే ఇదంతా జరుగుతుందని స్థానికులు చర్చించుకుంటున్నారు. తవ్వేసిన కొండ ప్రాంతంలో ముందుగా చిన్న షెడ్లు వేసి.. తరువాత భవనాలను నిర్మిస్తున్నారు. ఈ నిర్మాణాలపై రాజకీయ నేతల ఒత్తిళ్లు ఉండడంతో అధికారులు నోరు మెదపలేకపోతున్నారు. ఇదే విషయమై మండల రెవెన్యూ అధికారి రాజేష్ వద్ద సాక్షి ప్రస్తావించగా సెలవు రోజుల్లో తవ్వకాలు చేస్తున్నట్టు తమ దృష్టికి వచ్చిందన్నారు. ఈ తవ్వకాలపై దృష్టి సారిస్తామని, విడిచిపెట్టేది లేదన్నారు. ఈ తవ్వకాలపై మైనింగ్ అధికారులు కనీసం దృష్టి సారించకపోవడంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు తగు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

### చెడు అలవాట్లకు బానిస కావొద్దు..



నరసయ్యపేటలో లఘుచిత్రాన్ని ప్రదర్శిస్తున్న పోలీసులు

మెరకముడిదాం: నేటి యువత చెడు వ్యసనాలకు బానిసలు కావొద్దని ఎస్ఐ జె.లోకేశ్వరరావు అన్నారు. మండలంలోని గొట్టుపల్లి, నరసయ్యపేట, సింగవరం గ్రామాల్లో సంకల్పం రథంతో మాదక ద్రవ్యాలతో జరిగే అనర్థాలను గురించి మంగళవారం అవగాహన కల్పించారు. ఈ రథం ద్వారా పలు లఘు చిత్రాలను ప్రదర్శించి అవగాహన కల్పించారు. యువత మంచిగా చదివి ఉజ్వల భవిష్యత్‌ను ఏర్పాటు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

### పింఛన్ల పంపిణీ



ఎం.కొత్తవలసలో పింఛన్లు పంపిణీ చేస్తున్న మంత్రి శ్రీనివాస్

బొండపల్లి: మండలంలోని ఎం.కొత్తవలస గ్రామంలో రాష్ట్ర చిన్న, మధ్య తరహా, సెర్ప్, ఎన్ఆర్ఐ వ్యవహారాల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ కొత్తగా మంజూరైన వితంతు పింఛన్లను మంగళవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి పింఛన్లు అందజేయాలని సూచించారు. అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ పింఛన్ అందజేస్తామన్నారు. డీఆర్‌డీఏ పీడీ కల్యాణ్‌చక్రవర్తి, ఎంపీడీఓ గిరిబాా, సర్పంచ్ కర్రోతు శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

# తాగునీటి ఎద్దడి లేకుండా చర్యలు

లక్కవరపుకోట : వేసవిలో ప్రజలతో పాటు పశువులకు కూడా తాగునీటి సమస్య లేకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి సూచించారు. మండల కేంద్రంలోని పశువుల ఆసుపత్రి ఆవరణలో మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో నీటి తొట్టె నిర్మాణానికి ఆమె మంగళవారం భూమి పూజను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రస్తుతం వేసవి ప్రతాపం ఎక్కువగా వుందన్నారు. తాగునీటికి పశువులు ఇబ్బంది పడకుండా పశు వైద్యశాలల వద్ద, గ్రామాల్లో నీటి తొట్టెలను నిర్మించాలని ఆమె అన్నారు. అనంతరం ఎంపీడీఓ మాట్లాడుతూ నీటి తొట్టెలను రూ.33 వేలతో నిర్మిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పశువైద్యాధికారి కోరాడ గాయిత్రి, ఏపీఓ విజయలక్ష్మి, మాజీ ఎంపీపీ, జెడ్పీటీసీలు కొల్లు రమణమూర్తి, కరెడ్ల ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

**భూమి పూజ**

గజపతినగరం రూరల్: గ్రామీణ ప్రాంతాల్లోని ఎండ తీవ్రతకు తాళలేక దాహార్తిని బారిన పడుతున్న పశువులకు నీళ్లతొట్టెలను నిర్మించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ముందుకు వచ్చిందని ఎంపీడీఓ కల్యాణి తెలిపారు. మండలంలోని కాళంరాజుపేట గ్రామంలో పశువుల తొట్టె నిర్మాణానికి ఎంపీడీఓ మంగళవారం భూమి పూజ నిర్వహించారు. ఏపీఓ చప్పరామారావు, సర్పంచ్ గేదెల ఈశ్వరరావు, సచివాలయ సిబ్బందితో పాటు పలువురు పాల్గొన్నారు.

# ఎస్‌ఎంఎస్ పరిశ్రమలో మజ్జిగ చలివేంద్రం



చలివేంద్రాన్ని ప్రారంభించిన పరిశ్రమ యూనిట్ హెడ్ గోపి

మెరకముడిదాం: మండలంలోని గర్భాం ఎస్ఎంఎస్ ఫెర్రో పరిశ్రమలో పరిశ్రమ యాజమాన్యం ఆధ్వర్యంలో మజ్జిగ చలివేంద్రాన్ని ఆ పరిశ్రమ యూనిట్ హెడ్ వాకాడ గోపి మంగళవారం ప్రారంభించారు. ముందుగా పరిశ్రమలో పని చేస్తున్న కార్మికులకు మజ్జిగ అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పరిశ్రమ యాజమాన్యం వేసవి కాలాన్ని దృష్టిలో పెట్టుకొని కార్మికుల దాహార్తిని తీర్చే విధంగా ఈ మజ్జిగ చలివేంద్రాన్ని ఏర్పాటు చేసినట్టు ఆయన తెలిపారు. ఈ చలివేంద్రం ఏప్రిల్, మే, జూన్ మొత్తం మూడు నెలలు పాటూ నిర్వహించనున్నామని ఆయన తెలిపారు. మజ్జిగ చలివేంద్రాన్ని కార్మికులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ప్రొడక్షన్ ఇంఛార్జ్ ఎంసీఎస్ఎస్ఎన్.మూర్తి, హెడ్ మేనేజరు పక్కి శ్రీను, స్టోర్స్, పర్చేజ్ హెడ్ ఉప్పు శ్రీను తదితరులు పాల్గొన్నారు.

**మజ్జిగ పంపిణీ**

కొత్తవలస: మండల కేంద్రంలో సంత ప్రదేశంలో అయ్యరక సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో మజ్జిగను మంగళవారం పంపిణీ చేశారు. వేసవి ఎండల తీవ్రత దృష్ట్యా ప్రజల దాహార్తిని తీర్చేందుకు ఈ కార్యక్రమం చేపట్టామని సంఘం అధ్యక్షుడు పెదిరెడ్ల వెంకటసత్యనారాయణ అన్నారు. సంఘ పెద్దలు సూరిబాబు, వెంకటేష్, రాంబాబు పాత్రుడు, వెంకన్నపాత్రుడు, బంగారు రమేష్ పాల్గొన్నారు.

### నీటి తొట్టెల నిర్మాణానికి నిధులు

చీపురుపల్లి: వేసవి కాలం మూగజీవాలుకు తాగునీరు అందించేందుకు ప్రభుత్వం నీటి తొట్టెలు నిర్మాణానికి నిధులు మంజూరు చేస్తున్నట్లు పశుసంవర్ధక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ డా.ఆర్.శారద మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అందులో భాగంగానే మండలంలో 20 చోట్ల నీటి తొట్టె నిర్మాణానికి స్థలాలు గుర్తించినట్లు తెలిపారు. ఇప్పటికే 12 నీటి తొట్టెలు నిర్మాణానికి ఉపాధి హామీ పథకం నుంచి సాంకేతిక అనుమతులు లభించాయని పేర్కొన్నారు. అందులో ఆరు చోట్ల పనులు కూడా ప్రారంభమయ్యాయని తెలిపారు. ఒక్కో నీటి తొట్టె నిర్మాణానికి రూ.33 వేలు నిధులు మంజూరు చేస్తున్నట్లు పేర్కొన్నారు. వీటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

# ఉపాధ్యాయ వృత్తి పవిత్రమైనది

కొత్తవలస : అన్ని ఉద్యోగాలకన్నా ఉపాధ్యాయ వృత్తి ఎంతో పవిత్రమైనదని ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి అన్నారు. మండలంలోని కంటకాపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పి.అరుణకుమార్ పదవీ విరమణ కార్యక్రమంలో ఆమె మంగళవారం పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విధి నిర్వహణలో అందించిన సేవలే మంచి గుర్తింపునిస్తాయని తెలిపారు. ఎంపీపీ నీలంశెట్టి గోపెమ్మ మాట్లాడుతూ అరుణకుమార్ పర్యవేక్షణలో ఎంతో మంది విద్యార్థులను ఉన్నతంగా తీర్చిదిద్దారని కొనియాడారు. ఈ సందర్భంగా అరుణకుమార్ దంపతులను పాఠశాల విద్యాకమిటీ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎంఈఓ బండారు శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

### ఉపాధి బిల్లులు లేవు

దత్తిరాజేరు : ఉపాధి హామీ పథకం కింద పని చేసిన గుచ్చిమి గ్రామ వేతనదారులతో పాటు మధుర గ్రామమైన భోజరాజపురం గ్రామస్తులకు కొద్ది నెలలుగా బిల్లులు చెల్లించకపోవడంతో ఆకలితో ఇబ్బందులు పడుతున్నామని ఎంపీడీఓకు ఆయా గ్రామాల వేతనదారులు తెలిపారు. మంగళవారం వారు ఎంపీడీఓను కలిశారు. ఇప్పటికై నా తమ బకాయి బిల్లులు చెల్లించాలని వారు కోరారు.

# ఎస్సీ కాలనీలో తాగునీటి కష్టాలు



ఎంపీడీఓకు వినతిపత్రం అందజేస్తున్న ఏపీ కార్మిక సంఘం నాయకులు

దత్తిరాజేరు: గుచ్చిమి ఎస్సీ కాలనీ వాసులు తాగునీటి కోసం ఇబ్బందులు పడుతున్నారని అధికారులు తాగునీటి ఎద్దడి నివారణ చర్యలు తీసుకోవాలని ఏపీ కార్మిక సంఘం నాయకులు పురం అప్పారావు అన్నారు. మంగళవారం గ్రామస్తులతో కలిసి ఎంపీడీఓ రాజేంద్రప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గుచ్చిమి ఎస్సీ కాలనీ వాసులు కొద్ది నెలలుగా తాగునీటి కోసం అవస్థలు పడుతున్నారని తెలిపారు. అధికారులు తక్షణమే స్పందించాలని కోరారు.

# అంతా గందరగోళం

- బీసీ రుణాల కోసం దరఖాస్తుల వెల్లువ
- ఉన్న యూనిట్లు పదుల సంఖ్యలో..
- వచ్చిన దరఖాస్తులు వందల్లో...



ఎంపీడీఓ కార్యాలయం ఆవరణలో గందరగోళంగా రుణాల దరఖాస్తుల పరిశీలన

లక్కవరపుకోట : బీసీ కార్పొరేషన్ ద్వారా రుణాలు మంజూరు కోసం వందల సంఖ్యలో అభ్యర్థులు దరఖాస్తు చేసుకోగా వాటి పరిశీలన గందరగోళంగా మారింది. దరఖాస్తుల పరిశీలన నిమిత్తం పెద్ద సంఖ్యలో అభ్యర్థులు తరలి రావడంతో కనీస సదుపాయాలు లేక అవస్థలు పడ్డారు. మండలంలోని బీసీ కార్పొరేషన్ ద్వారా రాయితీపై రుణాలు ఇస్తామని అధికారులు చెప్పడంతో మండలంలో 31 గ్రామ పంచాయతీల నుంచి 539 మంది దరఖాస్తులను ఆన్‌లైన్‌లో పెట్టారు. వీరందరికీ మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో మంగళవారం దరఖాస్తుల పరిశీలన కార్యక్రమాన్ని చేపట్టారు. మొదట గ్రామాల వారీగా అభ్యర్థులు పిలిచి దరఖాస్తులను పరిశీలన చేశారు. ఇంతలోనే ఏం జరిగిందోగానీ అధికారులు తమకు ఇష్టం వచ్చిన వారి దరఖాస్తులను పరిశీలించడంతో అభ్యర్థులు దీనికి ఒక పద్ధతి లేదా.. అంటూ అధికారులతో వాదులాటకు దిగారు. అయినా అధికారులు పట్టించుకోలేదు. మండలానికి కేవలం 86 యూనిట్లు మాత్రమే కేటాయించగా వందల్లో దరఖాస్తులు రావడంతో అభ్యర్థులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. రాజకీయ నేతల ప్రాపకం ఉన్న వారికే ఇవి కేటాయిస్తారని దీనికి ఇంత బిల్డప్ ఎందుకని దుయ్యబట్టారు. పరిశీలనలో ఎంపీడీఓ సింగంపల్లి అప్పారావు, ఎస్‌బీఐ, కార్పొరేషన్ బ్యాంకు, గ్రామీణ బ్యాంకుల మేనేజర్లు పాల్గొన్నారు.

### బ్రిడ్జి కోర్సులు సద్వినియోగం కావాలి

చీపురుపల్లి: పట్టణంలోని జీవీఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం విద్యార్థుల కోసం బ్రిడ్జి కోర్సులను ప్రారంభించామని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఆ కళాశాల ప్రిన్సిపాల్ మద్దలి వినోద్‌బాబు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రథమ సంవత్సరం నుంచి ద్వితీయ సంవత్సరంలోకి అడుగు పెడుతున్న విద్యార్థులు తప్పనిసరిగా ఏప్రిల్ 23 వరకు కళాశాలకు రావాలని సూచించారు. గణితం, ఇంగ్లీషతో పాటు ఆర్ట్స్ గ్రూపులు వారికి కూడా బ్రిడ్జి కోర్సులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అంతేకాకుండా పాఠ్య పుస్తకాలు, నోట్ బుక్స్, ల్యాబ్ రికార్డులు అందజేయనున్నట్టు పేర్కొన్నారు.

### తాగునీటి కోసం నీటి తొట్టెలు

వేపాడ: పశువుల దాహార్తి తీర్చేందుకు నిర్మిస్తున్న నీటి తొట్టెలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి అన్నారు. మండలంలోని జాకేరులో ఉపాధి హామీ పథకం కింద ఏపీఓ ఆదిలక్ష్మి ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో నీటి తొట్టెలు నిర్మాణానికి భూమి పూజ చేశారు. ఏపీఓ మాట్లాడుతూ మండలంలో 16 నీటి తొట్టెలు మంజూరైనట్టు తెలిపారు. ఒక్కో తొట్టె నిర్మాణానికి రూ.33వేలు మంజూరు చేస్తున్నట్టు తెలిపారు.